1. వచ్చిరి యూదులు – ముచ్చట లాడుచు – నెచ్చట వాఁడనుచు = నిన్ను – మచ్చరముతో వారి – యిచ్చ వచ్చినట్లు – కొట్టి దూషించినారా ॥యెంతో॥

2. సుందరమగు దేహ – మందున దెబ్బలు – గ్రంధులు గట్టినవా = నీవు – పొందిన బాధ నా – డెందము తలఁపనా – నందములే దాయెను ॥ఎంతో॥

3. కొట్టుకొట్టుమని – తిట్టికేల్ దట్టిని – న్నట్టిట్టు నెట్టుచును = వారు – పెట్టుశ్రమలు తుద – మట్టున కోర్చియుఁ – బెట్టితివా ప్రాణము ॥నెంతో॥

4. నెపముఁ బెట్టుచుఁ దిట్టి – యపహసించుచు యూద – చపలులు గొట్టి నారా = నా – యపరాధములకు నా – పదలను బొంది నీ – కృప నాకుఁ జూపినావా ॥యెంతో॥

5. చక్కని నా యేసు – మిక్కిలి బాధ నీ – కెక్కువ గలిగె నయ్యా = ఆహా – యొక్క దుష్టుఁడీటె – ప్రక్కను గ్రుచ్చి తన – యక్కస దీర్చుకొనెనా॥యెంతో॥

6. అన్నదమ్ములైన – అక్క సెల్లెం డ్రైనఁ – కన్న పిత్రాదు లైన = నన్ను – ఎన్నఁ డైనఁ బ్రేమించలే రైరి నా – యన్నా ప్రేమించినావా ॥యెంతో॥

– బూదాల లైమన్

## 183 క్రీస్తుని సిలువ

రా – ముఖారి (చాయః ఎంతో దుఃఖము బొందితివా) తా – త్రిపుట

సిలువను మోసితివా – నా కొఱకై – కలువరి మెట్టపైకి = సిలువ నా యాత్మలోఁ – బలుమాఱు దలఁపఁగాఁ – దాలిమి లేదాయెను – హా యీ – జాలికి మారుగా – నేనేమి సేయుదు – ప్రేమను మరువఁజాల ॥సిలువ॥

1. ఘోరమైనట్టి యీ – భారమైన సిలువ – ధరియించి భుజముపైని = నా – దురితముల్ బాపను – కరుణచేఁ జనుదెంచి – మరణము నొందితివా ॥సిలువ॥

2. కలువరి మెట్టపైఁ – కాలు సేతు లెల్ల – చీలలతోఁ గ్రుచ్చిపట్టి = యా – సిలువకుఁ గొట్టఁగ – విలువైన నీ మేని – రక్తము ప్రవహించెనా ॥సిలువ॥

3. మెట్టపైన నిన్నుఁ – పెట్టిన బాధ నేఁ – బట్టి తలంపఁగను = ఆహా పట్టైన నీ ప్రేమ – నెట్టుల మఱతును – కష్టముల్ గలిగినను ॥సిలువ॥



4. పంచగాయములను – నెంచి యాత్మలోన – నుంచి తలంపఁగను = హానా – మించిన దురితముల్ – ద్రుంచి నన్నెంచిర – క్షింపవచ్చెను భూమికి ॥సిలువ॥

## 184 ఆశ్చర్యకరమైన సిలువ

రా – పున్నాగ తోడి (చాయః ఎంతో సుందరమైనవి) తా – త్రిపుట

ఏమాశ్చర్యము ప్రియులారా – క్రీస్తు మరణము – ప్రేమజూడరెమనసార = ఆ మహాత్ముఁడు మరణ – మగు రీతిఁ గనుకొన్న – సామాన్యమగు నొక్క – జనుని చందము గాదు = ఈ మహిని గల పాప జీవుల – పై మహాకృపఁ జూపి నిత్య – క్షేమ మొసఁగెడు కొరకు బలు శ్రమ – చే మృతుండైనాఁడు స్వేచ్ఛను ॥ఏమాశ్చర్యము॥

1. కొండవలె భారమై – లోక పాపములు – దండింపఁబడె ఘోరమై = నిండు భారము క్రింద – నిలుచున్న వేళను – గుండె దిగులునఁ దనువు – నిండె రక్తపుఁ జెమట = మెండుకొని దు:ఖములతో నా – తండ్రి యీ పాత్రమును నా కడ – నుండి తొలగించుటకు మనపై – యుండినను జేయమని వేఁడెను ॥ఏమాశ్చర్యము॥

2. కడు దుర్మార్గులచేతను – క్రీస్తుఁడు పట్టు – వడె దానంతట తాను = చెడుగు లెందరు నింద – జేసి మోముపై [1]నుమిసి – వడిముళ్లతో నల్లఁ – బడిన కిరీటము = [2]తడయ [3]కౌదల బెట్టి కరముల – నడుగులను సిలువ నిడి మేకులు – [4]దొడిపి ప్రక్కను రక్తజలములు – [5]దొరగ [6]గుంతము గ్రుచ్చి రహహా ॥ఏమాశ్చర్యము॥

3. ఇరు పార్శ్వముల నిద్దరి – దొంగల నునిచి – మరణావస్థలఁ బెట్టిరి = నిరపరాధి ప్రభువు – దురితాత్ము లొనరించు – తరుచు బాధల కోర్చి – మరి వారిఁ గరుణించి = యెరుఁగ రేమి యొనర్తురో యీ – దురిత జీవులు వీరి నోహో – పరమ [8]జనక క్షమించు మని తన – [9]యరుల కొరకై వేఁడు కొనియెను ॥ఏమాశ్చర్యము॥

– పురుషోత్తము చౌధరి

---

[1]ఉమ్మివేసి. [2]ఆలస్యముచేయక. [3]తలమీఁద. [4]గ్రుచ్చి. [5]దొర్లునట్లు. [6]ఈటె. [7]ప్రక్కల. [8]తండ్రీ. [9]శత్రువులు.